# దసరా కుడుము(,వు,)లు

శ్రీమతి శ్రీపాద శారదాదేవిగారు

వ్యాకరణ ద్వీపాగ్రహారములో ఈసారి దసరా మహోత్సవము చాల వైభవముగ జరిపించు విషయమై అచ్చుల పాటివారు హల్లులపాటివారు ఉభయాలవారు కలిసి గట్టి ప్రయత్నముచేయ మొదలిడిరి. క్రియల ధాతయ్య మనుమరాలి మగడొకడు కాశికి వెళ్లి వ్యాకరణశాస్త్రమునందును శబ్ద శాస్త్రమునందును గొప్ప పాండిత్యము సంపాదించుకొని వచ్చినాడు అప్పటి నుండియు తన మాతృభాషయైన ఆంధ్రభాష యందభిమానము గలిగి దాన్ని గూర్చి పరిశోధనచేయ మొదలిడినాడు. అగ్రహారీకులు అతనిని కాశీపండితుడనియే వ్యవహరింతురు. అగ్రహారములోని సహపాఠులు కొందరు ఆంధ్రవ్యాకరణము అభిమాన విషయముగా నభ్యసించినందున దసరా మహోత్సవ కార్యక్రమములో కాశీ పండితుని ఉపన్యాసము ఒకటి 'ఆంధ్రులు తెలుగువారు' అను విషయముపై నిష్పింప నేర్పాటుజరిగెను. పండితుని యుపన్యాసమునకు ముందు అగ్రహారమునందు దసరా సమయమున కొన్ని ఆకర్షణీయములగు ప్రదర్శనములు జరిగినవి.

వ్యాకరణ దీపాగ్రహారీకులకు రానురాను ఆత్మరక్షణకుగాను కొంతమంది బాలభటులను యుద్ధప్రియులుగా తయారుచేయవలసిన యవసరమేర్పడినది. అందుచేత కొంతమంది బ్రాహ్మణవిద్యార్థులు క్షత్రియ బాలురవలె ధైర్యసాహసౌదార్యాది సుగుణములనేగాక శారీరకముగా అంగసౌష్టవము గూడ పెంపుచేసికొనిరి. అయితే యిన్ని యుండియు వారికొక్కరీతిదుస్తులు లేకున్నదియు నొకగొప్ప కొరత యేర్పడును. గావున వారికందరకు వారి నాయకు డొకవిధమై విలక్షణమైన దుస్తులు కుట్టించి తొడిగించి వారిని తృప్తిపరచి తాను తృప్తి పఢినాడు. కాని వారు ధరించు టోపీల విషయమై ఒక్కతీరైన వస్త్రధారణము జరుపుటకు వీలులేక పోయినది. కాబట్టి వారి నాయకుడు వారి నందరిని రెండు తెగలగా భాగించి మొదటివారిని తెలుగు జోదులని పిలిచినాడు. రెండవ తెగవారికి సాంస్కృతులని పేరిడినాడు. తెలుగుజోదులందరు 'థేట్ తెలంగానా' గడ్డకు జెందిన వారనియు సాంస్కృతికులందరు ఉత్తర దేశమునుండివచ్చి దక్కను పీఠభూమిపై నున్న తెలుగువారితో గలసిపోయినారనియు, వారిముఖములు, తలపుర్రెలు, దంతములు, దవడలు, మొదలైన అవయవ పరీక్ష కొంత యొనరించి నిర్ణయించినందున

ఇప్పుడా రెండువర్గములవారికి నేర్పాటు చేసిన శిరోవేష్టధారణ విధానములో భేద మేర్పడినది. అది యీరీతిగానున్నది.

తెలుగుజోదులకందరికి అసలు టోపీలే అక్కరలేదన్నాడు. కాబట్టి టోపీ లేని తెలుగుజోదులందరు ఒక రెజిమెంటులో జేరవలసినవారైనారు. ఇక సాంస్కృతికులకు నైనను నొక్కవిధమైన టోపీల యేర్పాటు చేయ వారి నాయకునకు సాధ్యమనిపింప లేదు. కావున వీరికి మూడువిధములైన టోపీల నేర్పాటుచేసినాడు. కొన్ని 'డు' టోపీలన్నారు. మరికొన్నిటిని 'ము' టోపీ లన్నాడు. ఇంక కొన్నిటిని 'వు' టోపీ లన్నాడు. ఈ మూడువిధములైన టోపీలను నెవ రేవి ధరింపవలసియున్నదను విషయములో గొన్ని నిబంధనల నేర్పాటుచేసి నాడు.

తెలుగుజోదులనందరిని యిప్పటి పరి భాషలో వలయశిరస్కులని చెప్పబడిరి. అనగా గుండ్రనితలలు కలవారన్నమాట. వారిజుట్టు కత్తిరింపు విధానము వారికీపేరు కల్పింపచేసినది. వారికేమియు టోపీలు లేకపోయినను జుట్టుకత్తిరింపులో నొక్క రీతి పక్కి యేర్పడినది కాబట్టి ఆ రెజిమెంటు యూనిఫారమునకు నేమియు గొరతరాలేదు.

సాంస్కృతికులలో 'డు' టోపీలు ధరించు వారందరు తలకట్టు కలవారుగా నుండ వలెను. కాని గుడివంటి జుట్టుముడికల వారుగా నుండకూడదు. పుంల్లింగసంజ్ఞకల వారుగా మాత్రముండవలెను. ఈ టోపీలు ధరింపజేయునపుడు తలకట్టులకు తోడొకింత కొమ్ముంచవలసిన అవసరముకలిగినది. 'ము' టోపీలు ధరించువారందరు గుడివంటిజుట్టు ముడికలవారుగా మాత్రముండరాదు. కాని నపుంసకలింగ సంజ్ఞకలవారుగానుండవలెను. 'వు' టోపీలు ధరించువారందరు కొమ్ములు దిరిగినవారై యుండవలెను. కావున వీరికి పుంలింగసంజ్ఞ యుండవలసివచ్చినది. గుడి వంటి జుట్టుముడికల వారందరికి 'డు' టోపీలు తొడిగించి తరువాత నవి తీసివేయవలసిన యవసరము కలిగినది గావున వారి నెల్లైన ప్రత్యేకవర్గములో జేర్పవలసివచ్చి తెలుగు జోదులవలె సాంస్కృతికులలోని వీరుకూడ టోపీలేని రిజిమెంటులోనే జేర్పబడవలసిన వారైనారు.

సాంస్కృతికులలో కొందరు స్త్రీ బాల్య భటులు కూడ చేరుట తటస్థపడినందున వారి దీర్ఘాంతములైన శిరోజములను గురుచ లగా జేసివైచి ముంగురులూ గిరజాలు కల వారలుగ జుత్తుకత్తిరింపు చేసికొనవలసిన వారైనారు. ఈ రీతిగ సాంస్కృతికులలో అనుకొన్న మూడు రెజిమెంట్లకంటె లెక్క కెక్కువ కలవారు కావలసివచ్చినారు.

ఇటువంటి ప్రదర్శనము లెన్నియో నాటి దసరామహోత్సవములో జరిగినవట.

ఈ వ్యాసారంభమున మొదలు తెలిపిన కాశీపండితుని ఉపన్యాసమునకు జనులు క్రిక్కిరిసిపోయిరి. నాటి యుపన్యాససభకు

వెడలిన ఒక వ్యాకరణ పండితునకు వెడలని మఱొకనికి జరిగిన యీ క్రింది సంభాషణను బట్టి ఉపన్యాసమందలి విశేషాంశ సారాంశ ములు పాఠకులు తెలిసికొనవచ్చును. పై యిద్దఱి పండితులలో నొకరు దేవణభట్లు, నింకొకరు భట్టోపాధ్యాయులు.

**దేవణభట్లు**—మొత్తంమీద ఉపన్యాస కులు చెప్పినదాని సారాంశము ఆంధ్రులు తెనుగువారు ఆరంభంలో ఒక్కటెగవారు కారని తేలింది.

ఈశ్వరభట్టు — అట్లయితే తెలుగు వారి నివాసస్థానము యెక్కడదై వుంటుందని ఉపన్యాసకు లభిప్రాయపడుతున్నారు ?

దేవణభట్లు—ఆదిని యెక్కడ నివసిం చెడివారో యెవరు నిర్ధారణచేయలేదట. కాని తెలుగువారికి తెలంగాణమే నివాస స్థలమని —

ఈశ్వరభట్టు—ఆంధ్రులకో ?

దేవరభట్లు— ఆంధ్రులకు అమరావతి ముఖ్యపట్టణంగా యేలిన శాతవాహన రాజ్య భాగము ముఖ్యముగా ఇప్పటి కృష్ణ గోదా వరీ గుంటూరుమండలములలో నున్న దేశం నివాసభూమై వుంటుందట, కాని—

ఈశ్వరభట్టు—కానేమిటి ? నన్నయ భట్టు భారతంలోనే ఆంధ్ర తెలుగుశబ్దాలు ఒకదానికొకటి పర్యాయపదాలుగా యున్నాయంటె దానికేం కారణమైవుంటుం దంటారు ?

దేవణభట్లు—నన్ను పూర్తిగా చెప్ప నీయండి — కాని ఆంధ్రులు తెనుగు (తెలుగు) దేశముకూడ ఆక్రమించుకొని తెలుగు వారితో కలసిపోయినపుడు ఆంధ్రుల సంస్కృత ప్రాకృతభాషలు ద్రావిడభాషా కుటుంబానికిచెందిన తెలుగుభాషతో సంక్ర మించినవట. ఆంధ్రభాషలో ఆదిగ్రంధమను కొనే భారతము నాటికి ఈ రెండుభాషలు అభేదభావాన్ని పొందినవట.

ఈశ్వరభట్టు—మనంకూడ ఆంధ్ర వ్యాకరణముతో తృప్తిపడిఉండక సంస్కృత వ్యాకరణంలోకూడ కృషిచేస్తే మన కాశీ పండితుల వారివలెనే పండిత పరిషత్తుల్లో బిరుదులు సంపాదించుకోవచ్చును.

దేవణభట్లు—అంతకన్నానా! ప్రొద్దు పోయినది. పోదాం పదండి.